www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 19 ఫిబ్రవరి 2025
5
ఏలూరు



నేడు జిల్లాలో జర్మన్ ప్రతినిధుల బృందం పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు


రైతు సాధికార సంస్థ 'ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం' (ఎపిసిఎన్ఎఫ్) ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించేందుకు జర్మన్ ప్రతినిధి బృందం బుధవారం ఏలూరు జిల్లాలో పర్యటించనుంది. నలుగురు సభ్యులతో కూడిన ఈ బృందంలో 'ఫౌండేషన్ ఆన్ ఫ్యూచర్ ఫార్మింగ్' తరఫున జన్సర్ జోర్డన్, బెన్నెడిక్ట్ హెర్లిన్, పోర్చుగల్‌కు చెందిన ప్రాజెక్టు ఎర్త్ ప్రతినిధి డియోగో కొటినో, అటెలియర్ ఫర్ సిస్టమ్ చేంజ్ ప్రతినిధి లూకాస్ కేస్లో ఉన్నారు. ఈ బృందం ఏలూరు మండలం వెంకటాపురం, కామవరపు కోట మండలం ఆడమిల్లి, ద్వారకాతిరుమల మండలం గుండుగొలనుగుంట గ్రామాల్లో పర్యటిస్తారు.

పట్టభద్రులు పట్టం కట్టేదెవరికో..!

- టిడిపి, పిడిఎఫ్ అభ్యర్థుల మధ్య నువ్వా?నేనా అన్నట్లు పోటీ
- అధికారబలంతో సర్వశక్తులు ఒడ్డుతున్న కూటమి
- 8 నెలల పాలనపై ఉద్యోగులు, నిరుద్యోగుల్లో తీవ్ర చర్చ
- ఉద్యోగులకు ఏం చేశారంటూ అసంతృప్తి జ్వాలలు
- తొలి సంతకం మెగా డిఎస్‌సికి సైతం మోక్షం కరువు
- ప్రతియేటా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి హామీలపై చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పట్టభద్రులు ఎవరికి పట్టం కడతారనే చర్చ విస్తృతంగా సాగుతోంది. ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కొద్దీ పోరు మరింత రసవత్తరంగా మారుతోంది. గతంలో ఏ అధికార పార్టీ చేయని విధంగా పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. గెలుపు కోసం అధికార బలంతోపాటు సర్వశక్తులు ఒడ్డుతున్న పరిస్థితి ఉంది.


ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు ప్రచారం

మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపీలు, స్థానిక కూటమి పార్టీల నేతలంతా అసెంబ్లీ ఎన్నికల తరహాలో ప్రచారం నిర్వహిస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును ఎన్నికల్లో గెలిపించేందుకు ఉద్యోగ, కార్మికులతోపాటు ప్రజాసంఘాల నేతలంతా ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నెల 27న ఎన్నిక జరగనుంది. దీంతో మరో వారం రోజులే ప్రచారానికి గడువు మిగిలింది. దీంతో ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంది. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులను ఒకచోట సమావేశపర్చి అధికార పార్టీ ఎంఎల్‌ఎలు ప్రసంగాలిస్తూ టిడిపి అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతున్నారు. చాలాచోట్ల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నా పట్టించుకునే పరిస్థితి లేకుండాపోయింది. ఈ ఎన్నికల్లో 3.14 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లంతా ఉద్యోగులు, నిరుద్యోగులే. దీంతో అధికార పార్టీ నేతలు లోలోన తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎందుకంటే గడచిన ఎనిమిది నెలల పాలనలో ఉద్యోగులకు, నిరుద్యోగులకు ఒక్కటంటే ఒక్క ప్రయోజనం కూడా ప్రభుత్వం చేకూర్చని పరిస్థితి ఉంది.

ఉద్యోగులకు, నిరుద్యోగులకు ఏం చేశారంటూ చర్చ

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడిచింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులకు, నిరుద్యోగులకు కూటమి అనేక హామీలను గుప్పించింది. అధికారంలోకొచ్చాక ఇప్పటి వరకూ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. నిరుద్యోగుల కోసం అంటూ చేసిన తొలి సంతకం మెగా డిఎస్‌సికి ఇప్పటికీ మోక్షం లేకుండాపోయింది. ఎన్నికల్లో నిరుద్యోగులు ఎదురుతిరిగే ప్రమాదం ఉందని తలచి ఎన్నికల కోడ్ ముగియగానే డిఎస్‌సి నోటిఫికేషన్ అంటూ ప్రభుత్వం సన్నాయి నొక్కులు నొక్కుతోంది. తొలి సంతకం అమల్లోకి రావడానికి దాదాపు ఏడాది పడుతుందా అంటూ నిరుద్యోగుల్లో చర్చ సాగుతోంది. అంతేకాకుండా నిరుద్యోగులకు ఉపాధి కల్పించే వరకూ నెలకు రూ.మూడువేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చినా అతీగతీ లేదు. అసలు అమలు చేస్తారో, లేదో తెలియని పరిస్థితి ఉంది. ప్రతియేటా జాబ్ క్యాలెండర్ అంటూ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు. జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తారని నిరుద్యోగులంతా ఆశగా ఎదురు చూసినా నిరాశే మిగిలింది. ఉద్యోగులకు ఇప్పటి వరకూ ఏ ఒక్క హామీ అమలు చేయని పరిస్థితి నెలకొంది. పెండింగ్ డిఎలు ఒక్కటీ విడుదల చేయలేదు. పిఆర్‌సి వేయడం ఆలస్యం కావడంతో ఐఆర్ ప్రకటన ఉద్యోగులు ఎంతగానో ఎదురుచూశారు. అది చేయలేదు. దీంతో ఉద్యోగులంతా తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో అధికారపార్టీ నేతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఎన్నికల్లో ఓటు టిడిపి అభ్యర్థికి వేస్తారా, లేదా అని కూటమి పార్టీల నేతల్లో చర్చ నడుస్తోంది. ఉద్యోగులను బెదిరించైనా దారికి తెచ్చుకోవాలనే ప్రయత్నాలు సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఉద్యోగులు, నిరుద్యోగుల కోసం నిరంతరం నిలబడే పిడిఎఫ్ వైపు ఉద్యోగులు, నిరుద్యోగులు మొగ్గు చూపనుండటంతో అధికార పార్టీ నేతలు కలవర పడుతున్నారు. నువ్వా.. నేనా అన్నట్లు సాగుతున్న పట్టభద్రుల ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తుందో వేచిచూడాలి.



జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్‌కు వినతి అందిస్తున్న జర్నలిస్టులు, నేతలు


జర్నలిస్టులపై దాడులు దారుణం

వార్త..6లో...

బకాయిలు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగులో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం డిఇఒ వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న మెనూ ఛార్జీలు, మూడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ డిసెంబర్ నుండి మెనూ బిల్లులు రాక వేతనాలు లేక మధ్యాహ్న భోజన కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ పథకం నిర్వహణకు కార్మికులు ఎదురు పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ఈ పథకానికి బడ్జెట్ కేటాయించాలని, సకాలంలో వేతనాలు, బిల్లులు మంజూరు చేయాలని కోరారు. 9, 10వ తరగతి విద్యార్థులకు వండి పెట్టే వర్కర్లకు వేతనాలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, సంవత్సరానికి రెండు జతలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.


డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు, నేతలు

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించండి

ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాల నేతల విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాడే శక్తి పిడిఎఫ్ అభ్యర్థులకు మాత్రమే ఉందన్నారు. స్వలాభం కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం పాటుపడే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. డివి.రాఘవులు గత 40 సంవత్సరాలుగా యుటిఎఫ్‌లో వివిధ స్థాయిల్లో పని చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. రాఘవులు విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను లేవనెత్తి పరిష్కారం కోసం కృషి చేసే డివి.రాఘవులును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. శాసనసభలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై అడిగేవారే లేరని, ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రజాసంఘాల జిల్లా నేతలు ఆర్.లింగరాజు, టి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, ఎం.నాగమణి, ఎ.రవి, పిల్లి రామకృష్ణ, జి.రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించారు.


ఏలూరు: ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించిన నేతలు

కొయ్యలగూడెం: పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పిడిఎఫ్ అభ్యర్థికి ఎందుకు ఓటు వేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.నాగమణి, ఆంధ్రు బాబు, జి.రాజశేఖర్, ఆకుల దుర్గారావు పాల్గొన్నారు.


కొయ్యలగూడెంలో..

బలివే ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ముసునూరు

మహా శివరాత్రిని పురస్కరించుకుని బలేరామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మంగళవారం మండలంలోని బలివే గ్రామంలోని రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలుగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రూ.100, రూ.25, ఉచిత దర్శనానికి ప్రత్యేకమైన క్యూలైన్ల ద్వారా దర్శన మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. స్నానఘట్టాల వద్ద జల్లు స్నానాలకు ఏర్పాట్లు, పిండ ప్రదానాలు ప్రత్యేకమైన ప్రదేశంలో ఏర్పాటు, మహిళలకు బట్టలు మార్చుకునే గదుల ఏర్పాటు, ఘాట్ల వద్ద, దేవస్థానంలోను, పరిసర ప్రాంతాల్లోను ఫ్లడ్ లైట్ల ఏర్పాటు, ఘాట్ల వద్ద గజఈతగాళ్ల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్నానఘట్టాలు, దేవస్థానం, ఆర్‌టిసి బస్సులు నిలిపే స్థలాల వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని, దేవాలయంలోకి ప్రవేశించే మార్గం, వెలుపలికి వచ్చే మార్గం గుండా తప్పనిసరిగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. దాతలు, ప్రభుత్వ శాఖల ద్వారా తాగునీరు, మజ్జిగ, పాలు ఇచ్చే ప్రదేశాలు ముందుగానే నిర్ణయించుకుని తోపులాటలు లేకుండా పంపిణీ చేయాలని తెలిపారు. భక్తులకు అత్యవసరంగా వైద్యసేవలు అందించడానికి రెండు మెడికల్ క్యాంపులు, రెండు అంబులెన్సులు, అత్యవసర సిబ్బంది, మందులు, డాక్టర్లు ఉండాలన్నారు. పారిశుధ్యం విషయంలో ప్రత్యేక సిబ్బందిని ఇతర మండలాల నుంచి తీసుకొచ్చి ఎప్పటికప్పుడు స్నానఘట్టాలు, దేవస్థానం, ఉచిత ప్రసాదం అందించే ప్రదేశాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యాన్ని మెరుగుపర్చుకుంటూ ఉండాలన్నారు. ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. దేవస్థానం చుట్టుపక్కల అంతా పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి కంట్రోల్ రూం ద్వారా ఎప్పటికప్పుడు భక్తులకు దిశా నిర్దేశాలు తెలియజేయాలని చెప్పారు. అనంతరం కలెక్టర్ స్నానఘట్టాల ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించి జాగ్రత్తలపై తగుసూచనలు చేశారు. సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.రంగారావు, దేవస్థానం ఇఒ పామర్తి సీతారామయ్య, తహశీల్దారు కె.రాజ్‌కుమార్, ఎంపిడిఒ జి.రాణి, ఎస్ఐ ఎం.చిరంజీవి, సిఐ రామకృష్ణ, డిఎల్‌పిఒ సుందరి, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర షకీలా ఇవాంజలిన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

దోసపాడు దళితులు, పేదల పట్ల నిరంకుశత్వం తగదు

రెవెన్యూ శాఖ అధికారుల తీరుపై వ్యకాస ఆగ్రహం

ప్రజాశక్తి - దెందులూరు

దోసపాడు దళితులు, పేదల పట్ల రెవెన్యూ శాఖాధికారుల వ్యవహారంపై వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ తీవ్ర అభ్యంతరం తెలిపారు. మంగళవారం మండల రెవెన్యూ శాఖ కార్యాలయం వద్ద దోసపాడు దళితులు, పేదలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రెవెన్యూ శాఖాధికారులు, భూస్వాములు ఒక్కటై పేదలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను అమలు చేయకపోగా ఆర్డర్ కాపీ మూడు నెలల గడువు పూర్తయిన తర్వాత రెవెన్యూ శాఖాధికారులు, భూస్వాములు ఒక్కటై పేదలపై అక్రమ కేసులు, సిసిఎల్ఎ నుంచి నోటీసులు ఇవ్వడం పేదల హక్కులను హరించడమేనన్నారు. 9/77 చట్ట ప్రకారం అసైన్‌మెంట్ భూములు దళితులకు, పేదలకు చెందినవని, కాని ఈ చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు, మండల రెవెన్యూ సిబ్బంది భూస్వాములు ఇచ్చే లంచాలు మింగి రికార్డులను తారుమారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు ఇవే రికార్డులుగా చూపించడం సిగ్గుచేటన్నారు. గతంలో ఆర్‌డిఒ కోర్టుకెళ్లినప్పుడు భూస్వాములకు ఈ భూములు ఎలా చెందాయని ప్రశ్నించగా అధికారులు దిక్కులు చూశారని ఎద్దేవా చేశారు. అప్పటి ఆర్‌డిఒ ఇచ్చిన తీర్పును అమలు చేయలేదన్నారు. పేదల భూములు కావడంతో పేదలకే ఇవ్వాలని అప్పటి ఆర్‌డిఒ జాయింట్ కలెక్టర్ తీర్పును అమలు చేయకపోగా దెందులూరు తహశీల్దార్ భూస్వాములు ఇచ్చే లంచాలతో భూస్వాములకు కొమ్ము కాస్తున్నారన్నారు. పేదలు సిసిఎల్ఎను ఆశ్రయించగా తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పడంతో పాటు జిల్లా కలెక్టర్, మండల రెవెన్యూ శాఖాధికారులు సమక్షంలో ఈ సమస్య పరిష్కారమవ్వాలని చెప్పారన్నారు. దీంతో పేదలందరూ తహశీల్దార్‌ను అడగగా తనకు ఎలాంటి సంబంధం లేదని చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు. ఒక సమస్యను పేదలు ఒక ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లినప్పుడు దీనిపై ఆర్గ్యుమెంట్ చేయొద్దని చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. కొంతకాలంగా పేదలు అసైన్‌మెంట్ భూములు సాగు చేయడానికి అవకాశం ఉన్నా సాగు చేయకుండా రెవెన్యూ శాఖాధికారులు, పోలీసులను ఉసుగొలిపి దళితులను, పేదలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు 9/77 చట్టాన్ని అమలు చేయకుండా తుంగలోకి తొక్కారన్నారు. రెవెన్యూ శాఖాధికారులు ఈ విధంగానే వ్యవహరిస్తే ఈ నెల 28 తర్వాత జరిగే పరిణామాలకు మండల రెవెన్యూ శాఖాధికారులు, జిల్లా ఉన్నతాధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. మార్చి ఒకటి నుంచి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్న వాటిని సాగు చేసుకునే పంట వేసి పేదలకు అప్పచెప్పుతామని హెచ్చరించారు. ఈ పోరాటానికి ఈ ప్రాంతంలో ఉన్న దళితులు, పేదలు, రైతులు, కౌలు రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దోసపాడు భూ పోరాట నాయకులు పి.ఆనంద్‌రావు, జాన్‌రాజు, నాగేంద్ర, రాజు, లాజరమని, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యకాస నేత రామకృష్ణ

కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలి

ప్రజాశక్తి - ముసునూరు

గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావుని గెలిపించాలని సిఐటియు నాయకులు కొడవలి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ముసునూరులో లక్ష్మణరావు తరపున ప్రచారం నిర్వహించారు. ఉద్యోగ, కార్మిక, ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించే లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలన్నారు.

ప్రతిఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రతి వ్యక్తి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. దుగ్గిరాలలోని సెయింట్ విన్సెంట్ డిపాల్ డిగ్రీ కాలేజీలో డ్రైవింగ్ లైసెన్స్, వాహన నమోదు అంశంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్ఎసి) ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు చట్టానికి లోబడి నడుచుకోవాలని, ప్రజలకు ఈ చట్టాల పైన అవగాహన కలిగించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ముఖ్య ఉద్దేశమని, అందులో భాగంగా అవగాహనా సదస్సును ఏర్పాటు చేశామని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు రోడ్డు నిబంధనలను పాటించాలన్నారు. రవాణా శాఖాధికారి కె.కృష్ణారావు మాట్లాడుతూ వాహనాన్ని నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్‌ను తప్పనిసరిగా పొంది ఉండాలన్నారు. 16 నుంచి 18 ఏళ్ల వయసు కలిగినవారికి వారి సంరక్షకుని హామీతో మాత్రమే లైసెన్స్ ఇస్తారని, వీరు గేరు లేని చిన్న వాహనాలు నడపడానికి మాత్రమే అర్హులని తెలిపరు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఆన్‌లైన్ విధానం ద్వారా ఎల్ఎల్ఆర్‌కు నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఏలూరు మూడో పట్టణ ఎస్ఐ పి.రాంబాబు మాట్లాడుతూ విద్యార్థుల తరచూ ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్నారని, ఒక వాహనంపై ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ప్రయాణించాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపల్ రోబిన్ మాట్లాడుతూ ఇటువంటి అవగాహనా సదస్సులను ఈ కళాశాలలో తరచూ నిర్వహిస్తున్నామన్నారు. ఇటువంటి అవగాహనా సదస్సులు నిర్వహించటం వల్ల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలుగుతుందన్నారు.



మాట్లాడుతున్న కె.రత్నప్రసాద్

ఉపాధి కూలీల ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

మహిళా కూలీ మృతి
మరో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఉపాధి హామీ కూలీల ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ మహిళా కూలీ మృతి చెందింది. మరో ముగ్గురు మహిళా కూలీలు గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండలంలోని కుంతలగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కుంతలగూడెం గ్రామానికి చెందిన అల్లె భాగ్యవతి (55) మరికొందరు ఉపాధి హామీ కూలీలు ఆటోలో మంగళవారం గ్రామ పరిధిలో చిన్నాయగూడెం రోడ్డులో ఉపాధి హామీ పనులకు వెళ్లారు. పని ముగిసన అనంతరం ఆటోలో కుంతలగూడెం బయలుదేరారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఉపాధి హామీ కూలీల ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాగ్యవతి తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మరో ముగ్గురు కూలీలు రాపాక నాగమణి, చాపల ఇమ్మెలియా, బాసుబోయిన పోసమ్మలు గాయాలపాలయ్యారు. వీరిని స్థానికులు 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త వీరబ్బులు, కుమార్డుఉ, కుమార్తె ఉన్నారు. సంఘటనా ప్రాంతానికి ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.శ్రీనివాసరావు, ఎపిఒ నాగేశ్వరరావు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం రావడానికి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాద స్థలానికి ఎస్ఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

వసతి గృహ మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలి

సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణకుమారి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి సాంఘిక సంక్షేమ వసతి గృహ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రమణకుమారి సిబ్బందిని ఆదేశించారు. వసతి గృహంలో జరుగుతున్న మరమ్మతుల పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహనికి సంబంధించి ఎలక్ట్రికల్ పనులు, చేతి పంపులు, కిచెన్ షెడ్, స్లాబ్ రిపేర్, బాత్ రూమ్ ఇతరాత్ర మౌలిక సదుపాయాల కోసం ఎస్‌సి వెల్ఫేర్ నుంచి రూ.24 లక్షల నిధులు కేటాయించినట్లు ఆమె తెలిపారు. వీటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఇ సిహెచ్.పవన్‌కుమార్, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న రమణకుమారి

27న ఓటు హక్కు వినియోగానికి ప్రత్యేక క్యాజువల్ లీవ్

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా నియోజకవర్గ పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానాలకు ఈ నెల 27న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఆ రోజున ఈ పరిధిలోని ఓటర్లకు ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయివేటు సంస్థలు, యాజమాన్యాలు వారి వద్ద పని చేసే ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా సర్దుబాట్లు చేసుకోవాలని సూచించారు.

మృతురాలి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మృతి చెందిన ఉపాధి హామీ కూలీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మృతురాలు భాగ్యవతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారు కోలుకొనే వరకు వారి కుటుంబాలను ఆర్థికంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి నిర్లక్ష్యానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ చట్టం పని ప్రదేశాల వద్ద ప్రాథమిక వైద్యానికి సంబంధించిన సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

జర్నలిస్టులపై దాడులు దారుణం

పార్వతీపురం మన్యం జిల్లాలో మక్కువ ప్రజాశక్తి విలేకరిపై దాడి అమానుషం
ఎస్‌పి కార్యాలయం వరకూ ర్యాలీ, వినతిపత్రం అందజేత





ఏలూరులో ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల 'ప్రజాశక్తి' విలేకరి రామారావుపై ఆ మండల టిడిపి అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు చేసిన దాడిని యూనియన్లకు అతీతంగా ఏలూరు జిల్లాలోని జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. సమాజం కోసం పని చేసే జర్నలిస్టులపై దాడులు చేయడం అత్యంత దారుణమని మండిపడ్డారు. విలేకరిపై దాడి చేసిన వేణుగోపాల్‌నాయుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహం వద్ద నుంచి ఎస్‌పి కార్యాలయం వరకు ఎపియుడబ్ల్యుజె, ఎపిడబ్ల్యుజెఎఫ్, ఇతర సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున జర్నలిస్టులు హాజరై ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి' జనరల్ మేనేజర్ తిరుపాల్‌రెడ్డి, జర్నలిస్టు సంఘాల నేతలు కె.మాణిక్యాలరావు, జివిఎస్ఎన్.రాజు, రఘురాం, జబీర్, కెపికె.కిషోర్, పి.గంగరాజు తదితరులు మాట్లాడుతూ సమాజంలో ప్రజా సమస్యలపై నిరంతరం శ్రమిస్తూ ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే జర్నలిస్టులపై ఇలాంటి దాడులు జరగటం బాధాకరమన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు నిబంధనలు అతిక్రమించిన వారిపై జర్నలిస్టులు వార్తలు రాయటం సహజమేనని, అలాంటి వార్తలు రాసినందుకు మక్కువ మండల టిడిపి అధ్యక్షులు వేణుగోపాల్ ప్రజాశక్తి విలేకరిని నానా దుర్భాషలాడటమే కాకుండా చంపుతానని బెదిరించటం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై వెంటనే చట్ట ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ అధినేతలు కూడా ఇలాంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అహర్నిశలు సమాజం మేలు కోసం పాటుపడుతున్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కిషోర్, హరీష్, సుబ్బారావు, పి.నారాయణరాజు, వి.శివ ప్రసాద్, వై.సీతారాం, యు.శ్రీనివాస్, వెంకట్రావు, మహేష్, బ్రహ్మం, నాని, శేఖర్, రత్నకుమారి, రియాజ్, ప్రసాద్, కృష్ణ, శ్యామ్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.


టి.నరసాపురంలో...


వేలేరుపాడులో...


ద్వారకాతిరుమలలో...

టి.నరసాపురం: మన్యం పార్వతీపురం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై జరిగిన దాడిని ఖండిస్తూ టి.నర్సాపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన స్థానిక ఎస్ఐ ఎం.జయబాబు, తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ హరిబాబుకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు.

ద్వారకాతిరుమల: పాత్రికేయులపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ద్వారకాతిరుమల మండల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డిప్యూటీ తహశీల్దార్ బి.దుర్గామహాలక్ష్మికి వినతిపత్రం అందించారు.

వేలేరుపాడు రూరల్: విలేకరులపై దాడులను అరికట్టాలని, పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మండలంలోని విలేకరులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహశీల్దార్ డివి.సత్యనారాయణ, ఎస్ఐ కెవి.రామారావుకు వినతిపత్రాలు అందజేశారు.

కన్నప్పరాజు స్మారక స్తూపం ఆవిష్కరణ


స్తూపం ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సిపిఎం నాయకులు, పోరాట యోధుడు సోయం కన్నపరాజు జ్ఞాపకార్థం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో స్మారక స్తూపాన్ని ఆవిష్కరించినట్లు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు తెలిపారు. గ్రామంలో మంగళవారం కన్నపరాజు సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కన్నపరాజు మృతి పార్టీకి తీరని లోటన్నారు. ప్రజా పోరాటాల్లో, మామిడి తోట ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించేవారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, కొండలరావు, గంగరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో తన్మయి ప్రతిభ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి కాళంగి తన్మయి ఇఇఎం పరీక్షలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా విజయవాడలో నిర్వహించిన సన్మాన సభలో విద్యార్థి సర్టిఫికెట్, మెమెంటో, రూ.ఎనిమిది వేల నగదు బహుమతి అందుకున్నాడు. ఈ సందర్భగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్ మాట్లాడుతూ జిల్లాలోనే ప్రథమ స్థానం రావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. తన్మయిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

ఉపాధి పనుల ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో చనిపోతున్న కూలీలను ప్రభుత్వమే ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. కొయ్యలగూడెం మండలంలో ఉపాధి హామీ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ (ఎంపిడిఒ) అదనపు ప్రోగ్రామింగ్ ఆఫీసర్ (ఎపిఒ) పట్టించుకోకపోవడం వల్లే ఒక ఉపాధి కూలీ చనిపోయారని పేర్కొన్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, సౌకర్యాలు ఉండి ఉంటే కచ్చితంగా ప్రాణం నిలబడేదని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని, ఎవరైతే నిర్లక్ష్యంగా వ్యవహరించారో వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అంగన్వాడీ పిల్లల్లో అభ్యసన అనుభవాలను మెరుగుపర్చడానికి ఎఫ్ఎల్ఎన్ జ్ఞాన జ్యోతి కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని, ప్రతి అంగన్వాడీ టీచర్ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ కె.ఆనంద్‌కుమార్ అన్నారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు ఎఫ్ఎల్ఎన్ జ్ఞానజ్యోతి 120రోజుల సర్టిఫికేట్ కోర్సును ఎంఇఒలు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు.

మండవల్లి :ఆటలాధారిత అభ్యసనను అంగన్వాడీ చిన్నారుల్లో బలోపేతం చేసేందుకు బాల్యారంభ విద్య ఎంతగానో దోహదపడుతుందని ఉపాధ్యాయులు రూపుకుమారి స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ చిన్నారులకు మెరుగైన విద్య అందించే విధంగా జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు.

విద్యార్థులకు పరుపులు అందజేత

నూజివీడు టౌన్ :ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్‌లో మంగళవారం పియుసి-1 విద్యార్థులకు ఆర్‌జియుకెటి యాజమాన్యం పరుపులు పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో ఆర్‌జియుకెటి నూజివీడు డైరెక్టర్, రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్, పరిపాలనాధికారి డాక్టర్ లక్ష్మణరావు, డిడబ్ల్యుఎస్ డాక్టర్ దుర్గాభవాని, చీఫ్ వార్డర్ డాక్టర్ పివి.లక్ష్మణరావు, గౌతమీ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బంగారు, వెండి ఆభరణాలతో నవవధువు పరారీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నవ వధువు బంగారం, వెండి ఆభరణాలు పట్టుకుని పరారైన ఘటన ఏలూరు నగరంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. నగరంలో గజ్జల వారి చెరువు సమీపంలో వి.శివనాగసాయికృష్ణ జ్యూస్ దుకాణాన్ని నిర్వహిస్తూ జీవనన్ని సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 31వ తేదీన అతనికి విశాఖపట్నం జిల్లా విశాఖపట్నం కంచరపాలెం ప్రాంతానికి చెందిన బోడేపు చంద్రహాసిని అనే యువతితో వివాహమైంది. అత్తవారి ఇంటి వద్ద నుంచి ఏడు రోజుల క్రితం ఏలూరు నగరానికి చేరుకున్న కొత్తజంట కొత్త కాపురాన్ని బిట్టుబారు సమీపంలో ఉన్న అద్దె ఇంట్లో మొదలుపెట్టారు. అయితే ఈ నెల 16వ తేదీన భార్యాభర్తలు ఇరువురు నిద్రకు ఉపక్రమించారు. 17వ తేదీ శివ నిద్రలేచి చూసేసరికి చంద్రహాసిని కనిపించలేదు. ఆమె నాలుగు కాసుల బంగారు గొలుసు, ఉంగరం, వెండి పట్టీలు, సెల్‌ఫోన్‌తో పరారైనట్లు శివ గుర్తించాడు. రెండు రోజులపాటు ఆమె ఆచూకీ కోసం ఆమె తండ్రితో కలిసి పలు ప్రాంతాల్లో వెతికాడు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలని దిప్పకాయలపాడు గ్రామంలో సంభవించిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన బొట్ట వెంకటరమణకు చెందిన వర్జినియా పొగాకు బ్యారన్ దగ్ధమైంది. పొగాకు బ్యారన్ మంగళవారం ఉదయం క్యూరింగ్ దశలో ఉండగా రేషన్ కర్ర విరిగి పొయ్యి గొట్టంపై పడడంతో మంటలు చెలరేగాయి. బాధిత రైతు, స్థానికులు మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించగా ఫలితం లేకపోవడంతో అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే పొగాకుతో సహా బ్యారన్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.మూడు లక్షల నష్టం వాటిల్లిందని అగ్ని మాపక అధికారి అబ్రహం తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చెల్లని చెక్కు కేసులో జంగారెడ్డిగూడేనికి చెందిన ఎర్నెస్ట్ కుమార్‌కు ఆరు నెలల జైలు, రూ.12 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. వివరాల ప్రకారం... 2020 ఆగస్టు రెండో తేదీన గొల్లపల్లికి చెందిన మల్లవల్లి ప్రవీణ్‌కుమార్ రూ.పది లక్షల నగదు ఎర్నెస్ట్ కుమార్‌కు అప్పుగా ఇచ్చారు. కొంతకాలం తర్వాత బాకీ చెల్లించమని అడగగా ఎర్నెస్ట్ కుమార్ 2020 డిసెంబర్ 27వ తేదీన రూ.పది లక్షలకు ఒక్కొక్కటి రూ.ఐదు లక్షల చొప్పున రెండు చెక్కులను ఇచ్చారు. ఆ చెక్కులు బ్యాంకులో వేయగా నిందితుడు ఎర్నెస్ట్ కుమార్ ఖాతాలో నగదు లేని కారణంగా బ్యాంకు తిప్పి పంపించింది. దీనిపై కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఒక వ్యక్తిపై ముగ్గురు దాడి చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పేరూరులో ఈనెల 17వ తేదీ రాత్రి సుమారు 7:30 సమయంలో గ్రామానికి చెందిన బొర్రా మనోగాంధీ తన ఇంటి ముందు కారు పెట్టుకునే స్థలంలో ఒక ఆటో పెట్టి ఉంది. మనో గాంధీ ఇంటి బయటకు వచ్చి ఆటో దగ్గరికి వెళ్లి ఆటో తీయండి మా కారు పెట్టుకోవాలన్నాడు. దీంతో ఆటోలో ఉన్న ఏడుకొండలు, వీరమల్లు హరీష్, మెరుగుమాల ఉదయకుమారి మమ్మల్నే ఆటో తీయమంటావా అంటూ బూతులు తిట్టి కర్రలు తీసుకుని గాంధీని కొట్టి గాయపరిచారు. బాధితుడు మనోగాంధీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కైకలూరు కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

కొట్లాట కేసులో వ్యక్తి అరెస్టు

కొట్లాట కేసులో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని గురజలో ఈనెల 17వ తేదీ పాత కక్షల నేపథ్యంలో గుమ్మడి నాగ ఫణీంద్ర బాబు, అదే గ్రామానికి చెందిన దగాని వెంకటేశ్వరరావు, దగాని భాస్కరరావు, దగాని సురేంద్ర మధ్య కొట్లాట జరిగింది. ఈ కేసులో దగాని వెంకటేశ్వరరావును అరెస్ట్ చేసి కైకలూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

రఘునాథస్వామి సన్నిధి మరింత అభివృద్ధి

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఉన్న రఘునాథస్వామి వారిని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దర్శించుకున్నారు. మొదటిగా గ్రామ పెద్దలు, యాత్రికులు, చిన్నారులు, వేదపండితులు, భాజా భజంత్రీలు, మేళతాళాలతో మంత్రికి ఘన స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం మంత్రి మాట్లాడుతూ గొల్లపల్లి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానన్నారు. వచ్చే ఏడాది స్వామివారి సన్నిధిని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఆర్‌జియుకెటి నూజివీడులో సెమినార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నానో టెక్నాలజీ, అప్లికేషన్లపై ఆర్‌జియుకెటి నూజివీడులో సెమినార్ నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీర్, గుంటూరు అమరావతి రివిజన్ సెంటర్, ఆర్‌జియుకెటి కెమికల్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహించిన సెమినార్‌ను ప్రొఫెసర్లు అజయ్ బంసల్, అమరేంద్ర కుమార్ ప్రారంభించారు. ఎండోవ్‌మెంట్ లెక్చర్‌కు ప్రొఫెసర్ జగదీష్ చెన్నుపాటి (ఆస్ట్రేలియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ అధ్యక్షులు) ముఖ్య వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సెమినార్‌లో సెమీ కండక్టర్ నానోస్ట్రక్చర్లు - ఆప్టో ఎలక్ట్రానిక్స్, ఎనర్జీ సెన్సార్స్, న్యూరోసైన్స్ అప్లికేషన్లు అంశంపై సందేశం అందించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లి జెడ్‌పిహెచ్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో మినిమం స్టడీ మెటీరియల్ మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అబాస్ మాట్లాడుతూ ఈ మెటీరియల్‌ను చదివి అందరూ ఉత్తీర్ణులవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తల్లిబోయిన రాధిక, ఎస్ఎంసి ఛైర్మన్ పల్లి రామచంద్రరావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరి పద్మ కిషోర్, ఉపాధ్యాయులు రాంబాబుచ తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా కృష్ణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, కాంట్రాక్టర్ ముత్యాల వెంకటమురళిమోహనకృష్ణ జాతీయ కాపు సంఘం నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కర్ణ మురళీకృష్ణనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గ అధ్యక్షులుగా తనను నియమించడం పట్ల కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కాపు సంఘ ఐక్యత కోసం కృషి చేస్తానని కృష్ణ హామీ ఇచ్చారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - ముదినేపల్లి

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ వివిఎస్.వీరభద్రరావు అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో నేరాలు, చట్టాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా సేఫ్టీ, మహిళల పట్ల జరుగుతున్న నేరాలు, సైబర్ క్రైమ్‌ల గురించి విద్యార్థులకు వివరించారు. మండలంలోని సహాయమాత, గురజ, వడాలి హైస్కూల్స్‌లో అభయ వెహికల్ ద్వారా పోలీసులు విద్యార్థులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ పద్మావతి, పోలీసులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని అచ్యుతాపురం, పొంగుటూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎఒ చెన్నకేశవులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. మొక్కజొన్న, పొగాకు పంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు.


23న విలీన సభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 23వ తేదీన విజయవాడలో జరిగే రెండు న్యూ డెమొక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు యు.వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఏలూరు వన్ టౌన్ ఏరియా బడేటి చౌక వద్ద వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పదేళ్ల క్రితం రెండుగా చీలిపోయిన న్యూడెమొక్రసీ పార్టీల కలయికకు ఈ నెల 23వ తేదీన విజయవాడ ఎంబి భవన్‌లో సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, ఐఎఫ్‌టియు నగర సహాయ కార్యదర్శి ముంగము అప్పారావు, విజయ్, రమణ, కోరాడ అప్పారావు పాల్గొన్నారు.

రైతులంతా విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ భాషా


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి భాషా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రైతుల వ్యవసాయానికి సంబంధించిన సేవలను సులభంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌భాషా సూచించారు. మంగళవారం జీలుగుమిల్లి రైతు సేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని పలు రకాల పంట చేలను పరిశీలించారు. అనంతరం ఎర్రవరం కాలనీలో రైతులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే ఏ పథకం పొందాలన్నా రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరన్నారు. విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవడం వల్ల ప్రభుత్వ రాయితీలు, బీమా, పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంటరుణాలపై వడ్డీరాయితీ, రాయితీపై యంత్రపరికరాలు పరికరాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పిజి.బుజ్జిబాబు, వ్యవసాయ శాఖ మండలాధికారి కె.గంగాధర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు దుర్గ, లావణ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

వైరస్‌ల పట్ల అప్రమత్తత అవసరం

ఏలూరు సిటీ :ప్రజల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అశ్రద్ధ చేయరాదని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మసీదుపాడు గ్రామంలో ప్రజలకు వైరస్‌ల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల మంగళవారం అవగాహన కల్పించారు. గోవిందరావు మాట్లాడుతూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగ, వేతన భద్రత కల్పించాలి

మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించి వారికి ఉద్యోగ, వేతన భద్రత కల్పించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపుమేరకు సమస్యల పరిష్కారం కోరుతూ దశలవారి ఆందోళన కార్యక్రమంలో భాగంగా స్థానిక నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల వేతనాల చెల్లింపు, పనుల నిర్వహణ పూర్తి బాధ్యతలు మున్సిపల్ శాఖకే ఉండాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ కంపెనీ/ఏజెన్సీలకు అప్పగించే ఆలోచన విరమించాలన్నారు. అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికుల వేతనాల పెంపునకు గత సమ్మెలో నాటి ప్రభుత్వంతో అంగీకారమైన అగ్రిమెంట్ మేరకు వేతనాలు పెంచి ఇవ్వాలన్నారు. జనాభా ప్రతిపాదికన కార్మికులను పెంచాలన్నారు. ఇంజినీరింగ్ ఒప్పంద సిబ్బందికి సంక్షేమ పథకాలు గుర్తింపచేయాలని కోరారు. సంవత్సర కాలంగా అపరిష్కృతంగా ఉన్న మరణించిన, రిటైర్‌మెంట్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర యూనియన్ సభ్యులు దొడ్డికార్ల నాగబాబు, యలగాడ శివకుమార్, దుర్గారావు, మరియదాసు, ప్రసాద్, నాగబాబు, కిషోర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో నూజివీడు సబ్ జోన్ ఆటల పోటీలు

ఆగిరిపల్లి జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఈ నెల 21, 22 తేదీల్లో ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూజివీడు సబ్ జోన్ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సబ్ జోన్ పోటీల్లో నూజివీడు నియోజకవర్గ పరిధిలోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల పరిధిలోని బాల, బాలికలు పాల్గొంటారని, ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, పరుగు పందెలు, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 21న బాలురకు, 22న బాలికల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎంఇఒ ఆనంద్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు శివనాగేంద్రరావు, సుగుణరావు, ఉమ, నాగరాజు, రవీంద్ర, ప్రభాకర్, నాగేశ్వరరావు, స్టాఫ్ సెక్రటరీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో సబ్‌జోన్ ఆటలపోటీలు

ముదినేపల్లి :కైకలూరు నియోజకవర్గ సబ్‌జోన్ ఆటల పోటీలు బాలికలు, బాలురకు ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నట్లు ముదినేపల్లి జెడ్‌పి హై స్కూల్ హెచ్‌ఎం వై.విజయకుమార్ మంగళవారం తెలిపారు. 21న బాలికల ఆటలు పోటీలు ముదినేపల్లి హై స్కూల్‌లో నిర్వహించనున్నారు. అలాగే 22న బాలురకు ఆరుతెగలపాడు జెడ్‌పి హెచ్ పాఠశాలలో నిర్వహించనున్నారు.

ఎరువులు, పురుగు మందుల షాపుల్లో తనిఖీలు

చింతలపూడి :మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా ఎరువులు, పురుగుమందుల షాపులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో శ్రీ లావణ్య ట్రేడర్స్‌లో నిల్వలో వ్యత్యాసాలు గుర్తించినట్లు విజిలెన్సు ఎఒ జి.మీరయ్య, మండల వ్యవసాయ శాఖాధికారి కె.మీనాకుమారి తెలిపారు. రూ.1,60,276 విలువైన 22.395 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలు లేని రూ.1,02,450 విలువైన 81.605 లీటర్ల పురుగు మందులు గుర్తించి అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. శ్రీ లక్ష్మి ట్రేడర్స్‌లో సంబంధిత ధ్రువ పత్రాలు లేని రూ.16,050 విలువైన 9.550 మెట్రిక్ టన్నుల ఎరువులు గుర్తించి అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు.

రాజశేఖరంను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - దెందులూరు

ఈ నెల 27వ తేదీన జరిగే ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో గ్రాడ్యుయేట్లు అంతా కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం విస్తృత స్థాయి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏలూరులోని సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, సహా పలు విద్యా సంస్థల్లో ఆయన ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ :అభివృద్ధిలో రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలవాలంటే గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించాలని ఎంఎల్‌ఎ బడేటి చంటి, ఎంఎల్‌సి ఎన్నికల టిడిపి నియోజకవర్గ పరిశీలకురాలు ఆచంట సునీత అన్నారు. ఏలూరులోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగులతో మంగళవారం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కోరారు. ఆచంట సునీత మాట్లాడుతూ మేధావి వర్గాల జాబితాలో నిలిచే వారంతా ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ నూర్జహాన్, పార్టీ పరిశీలకులు షేక్ మీరావలి, కోఆప్షన్ సభ్యులు చూడ వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు : ఎంఎల్‌సి ఎన్నికల్లో రాజశేఖరంను గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులు మండలంలోని దాచారం పంచాయతీ పరిధి బెస్తగూడెం, నెమలిపేట, రాయకుంట గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. రాజశేఖరంను గెలిపించాలని కుక్కునూరులోని ప్రయివేట్ పాఠశాలల్లో ఉన్న ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు యుగంధర్, టిడిపి ఉపాధ్యక్షులు మధుర వెంకటరమణ, టిడిపి సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ, కుక్కునూరు ఉపసర్పంచి పిచ్చుక రాజు, కుచ్చర్లపాటి రమణరాజు, బొల్లు కృష్ణా, కోటి, పులి శ్రీను, రాంబాబు, వెంకటముత్యం, సురేష్ పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని ముసునూరు జెడ్‌పి హెచ్ స్కూల్లో ఉపాధ్యాయులను టిడిపి మండల నాయకులు కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు దేవినేని డలారం, గద్దె రఘుబాబు, కొల్లి గంగారం, రాపర్ల బాలకృష్ణ, మండలపు ధర్మరాజు, మసిముక్కు సుబ్బారావు, సురేంద్ర, కొండేటి బాబి, తోట శ్రీను, గార్లపాటి నరసింహారావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE V ADDITIONAL DISTRICT JUDGE (MACT) AT RAJAMAHENDRAVARAM, E.G. DISTRIC

M.V.O.P.No.82/2024

Between

Cheemala Durga and 4 others ...**Petitioners**

And

Bandi Kanchanavala and Another ...**Respondents**

R-1: Bandi Kanchanavala W/o. Late Musalayya, Aged - 55 years, Hindu, Female, Mother of deceased Owner cum Driver of the Auto Rickshaw bearing reg. No. AP 37 TH 0327, R/o. D.No. 10-103, BP Cheruvu, Kodamanchili Village, Achanta Mandal, West Godavari District - 534269 Palakol DMC,

The 1st respondent mentioned above may take notice that the above O.P. filed by the petitioners claiming compensation under M.V. Act, is posted to **24-02-2025** for service of notice to the said 1st respondent by way of paper publication and hence the 1st respondent may take notice that he has to attend the Court at **10:30** A.M. on **24-02-2025** and if he fails to attend the court on the said day, he will be set-exparte and the case will be proceeded further in his absence.

Rajamahendravaram, **(Sd/SRI.C.RAMA KRISHNA)**
Dt.08-02-2025. Advocate for the petitioner.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, టి.నరసాపురం మండలం, తెడ్లం గ్రామానికి చెందిన వింతా రత్నారెడ్డి, తండ్రి: వెంకటరెడ్డి కి చెందిన సర్వే నెంబర్ 53లో 1.18 సెంట్లు, సర్వే నెంబర్ 128లో 1.23 సెంట్లు, నా భార్య వింతా పద్మ పేరున ఉన్న సర్వే నెంబర్ 100, 124 లో 2.78 సెంట్లు గల నెంబర్లు కలిగిన దస్తావేజులు తీసుకుని ఈనెల అనగా ఫిబ్రవరి 2వ తేదీన చింతలపూడి మండలం ప్రగడవరంలో ఉన్న యూనియన్ బ్యాంకులో పంటరుణం కోసం తెడ్లం గ్రామం నుండి ప్రగడవరం వెళుతుండగా మార్గమధ్యంలో దస్తావేజులు పడిపోయాయి. దొరికిన వారు కింది అడ్రస్‌కు అందజేయగలరు.

వింతా రత్నారెడ్డి
తండ్రి: వెంకటరెడ్డి, తెడ్లం గ్రామం, టి.నరసాపురం మండలం, ఏలూరు జిల్లా.
సెల్: 7675057789, 9553322109

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIJAYAWADA

E.P. No. 95/2022

Arbitration Claim Petition No. 190/2019

Between :
M/s Margadarsi Chit Fund (P) Ltd.,
Rep. by its Foreman cum Br. Manager,
1 Town Branch, Vijayawada-1.
..... Decree Holder.

AND

V.V.Srinivasa Kumar & Others .... JDRs
JDR-2 : Nerella Hemanth Naga Kumar, S/o N.Venkata Rama Mohana Rao, D.No. 17-74 (3), Chilivuri Street, Akividu, West Godavari District.

Please take notice that the above execution petition is filed by the D.Hr./ Petitioner U/Or 21 Rule 54, 64 & 66 C.P.C. for recovery of Rs. 30,21,862/- with subsequent interest, costs. etc. stands posted to 03-03-2025 for your appearance in case of your failure to appear before the Hon'ble court at 10-30 A.M. on either in person or through Advocate. The matter will be decided exparte.

By order of the court
Sunkara Rajendra Prasad,
Advocate for Decree Holder,
Vijayawada.

IN THE COURT OF THE 9Th ADDITIONAL DISTRICT JUDGE:KOVVUR

O.S.No.9/2023

పరిమి ఉత్తమలక్ష్మి ...వాది
మరియు
మద్దిపాటి వెంకటలక్ష్మి వగైరా ...ప్రతివాదులు

To.
4వ ప్రతివాది (4వ రెస్పాండెంట్):- కంతేటి జయలక్ష్మి, భర్త గంగాధరరావు, వయస్సు 43, Properties, డోర్‌నెం.7-1-167, అయ్యప్ప టౌన్‌షిప్,రోడ్ నెం.7, పెరంపేట రోడ్, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాలో సంగతులు తెలియజేయు నిమిత్తం 4వ ప్రతివాది / రెస్పాండెంట్ కు దావా సంగతులు మరియు **I.A.No.655/2023** (టెంపరరీఇంజక్షన్‌పిటిషన్) మరియు **I.A.No.656/2023** (రిసీవర్ పిటీషన్) నోటీసు సంగతులు తెలియజేయు నిమిత్తం కోర్టు ద్వారాను మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను ఎన్ని పర్యాయాలు దావా సమన్లు మరి నోటీసులు పంపినప్పటికీ సదరు 4వ ప్రతివాది/రెస్పాండెంట్ బుద్ధిపూర్వకముగా Avoid చేయుచున్న కారణంగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా పై నంబరు దావా మరియు పై పిటిషన్స్ సంగతులు తెలియజేయడమైనది. పై నెంబరు దావాలో మరియు పై పిటిషన్స్‌లలో మీకు ఏవైనా అభ్యంతరములు వున్న యెడల **ది. 28-02-2025** వ తేదిన ఉదయం **10.30** నిIIలకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలియపర్చుకోవచ్చును. లేనియెడల వారి పరోక్షమున తీర్మానించడమగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా : 28-02-2025

ఆత్కూరి సత్యనారాయణ
వాది తరపు అడ్వకేట్
కొవ్వూరు సెల్ 9849847197
ది.14-02-2025 కొవ్వూరు., తూ॥గో॥జిల్లా